## క్లుప్తంగా

### ఉచిత కంటి పరీక్షలు



**రాజంపేట:** రాష్ట్రీయ బాల స్వస్థ ఆధ్వర్యంలో ఆరేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు లోపం ఉన్నవారికి అద్దాల కోసం సిఫారసు చేసినట్లు వైద్యులు తెలిపారు. అదే విధంగా రక్తహీనత ఉన్న విద్యార్థులను గుర్తించి ఐరన్ మాత్రలు అందజేశామన్నారు. అనంతరం న్యూట్రిషన్, ఆరోగ్య పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు దివ్యభారతి, హరీష్‌గౌడ్, స్వప్న, ఏఎన్ఎం నీరజ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### దంత వైద్య శిబిరం



**బాన్సువాడ రూరల్:** మండలంలోని కొయ్యగుట్ట తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ యువకేంద్రం, సేవా సంఘ యూత్, రాకేష్ దంత వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. దంత వైద్యులు రాకేష్ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. రాత్రి పడుకునే ముందు తప్పనిసరిగా బ్రష్ చేసుకోవాలని, దంతాలను సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీబాయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### యువత రాజకీయాల్లోకి రావాలి



**భిక్కనూరు:** యువత రాజకీయాల్లోకి రావాలని పీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన భిక్కనూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీరామ్ వెంకటేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి వస్తే అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. కాంగ్రెస్ నేతలు మైపాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, దుంపల మోహన్ రెడ్డి, సాజీద్, మద్దురి రవిలు పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదుపై విచారణ



**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):** జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదుపై ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ గురువారం నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో విచారణ జరిపారు. నాగిరెడ్డిపేటకు చెందిన బోయిని రాజశేఖర్ గ్రామంలోని సర్వే నం.506 ,507లలో గల వెంచర్‌పై కోర్టులో కేసు కొనసాగుతుందని, ఈ క్రమంలో ఆ వెంచర్‌లోని ప్లాట్లను ఎల్ఆర్ఎస్ చేయవద్దని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎల్‌పీవో నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొని విచారణ చేపట్టారు.

### సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):** సన్నరకం క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చినందున గురువారం నాగిరెడ్డిపేట, లింగంపల్లికలాన్ గ్రామాలలో కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. నాగిరెడ్డిపేట కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షుడు సాయాగౌడ్, ఉపాధ్యక్షుడు గోపాల్, లింగంపల్లి కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షుడు గణేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామకమిటీ మహిళా అధ్యక్షులు మంజుల పాల్గొన్నారు.

### కోతుల నుంచి కాపాడాలని వినతి

**భిక్కనూరు:** మండల కేంద్రంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని సమాచారహక్కు పరిరక్షణ కమిటీ జిల్లా ప్రతినిధి గంగ్లో రవీందర్ గురువారం ఫారెస్టు రేంజ్ అధికారి వద్ద సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. కోతులు ప్రజలపై దాడులు చేయడంతో పాటు ఇళ్లలోకి చొరబడి నానా బీభత్సం సృష్టిస్తున్నాయని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు.

# అనుమతులు అక్కర్లేదా?

- ముఖ్య చౌరస్తాల్లో వెలుస్తున్న రేకుల షట్టర్లు
- ఇష్టానుసారంగా షాపుల నిర్మాణం
- మున్సిపాలిటీకి ఆస్తి పన్ను చెల్లించని యజమానులు
- క్షేత్ర స్థాయిలో పరిశీలించని అధికారులు, సిబ్బంది
- అసెస్‌మెంట్ కాకపోవడంతో పుర ఆదాయానికి గండి



కొయ్యగుట్ట వెళ్లే దారిలో..



కొయ్యగుట్ట చౌరస్తా వద్ద వెలసిన దుకాణాలు

**బాన్సువాడ :** బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని ముఖ్యమైన చౌరస్తాలు, ప్రధాన రోడ్ల వెంట ఎక్కడబడితే అక్కడ రేకులతో కొందరు యజమానులు ఏకంగా షాపులను నిర్మిస్తున్నారు. వాటికి మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. అనంతరం ఇతరులకు కిరాయికి ఇచ్చి రూ.వేలల్లో పోగు చేసుకుంటున్నారు. అధికారులు, సిబ్బంది మాత్రం క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టకపోవడంతో పుర ఆదాయానికి ఏటా రూ.లక్షల్లో గండి పడుతోంది. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 19 వార్డులు ఉన్నాయి. కొన్నేళ్లుగా పట్టణం నలువైపులా విస్తరించి ఎన్నో కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. కొయ్యగుట్ట, తాడ్కోల్ గ్రామ పంచాయితీలో సగ భాగం మున్సిపాలిటీలో విలీనం అయ్యాయి. పట్టణంలో కొన్ని ప్రాంతాలకు రవాణా సౌకర్యం పెరిగింది. దీంతో ముఖ్య చౌరస్తాలతో పాటు ప్రధాన రోడ్ల వెంట కొందరు స్థల యజమానులు స్థానిక మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రేకులతో షాపులను పక్కాగా నిర్మిస్తున్నారు. కొన్నాళ్లుగా బాన్సువాడ – బోధన్ రోడ్డు, బాన్సువాడ – ఎల్లారెడ్డి కొయ్యగుట్ట సమీపం, తాడ్కోల్ చౌరస్తా నుంచి తాడ్కోల్ బస్టాండ్ వరకు ఉన్న ప్రాంతాలకు డిమాండ్ బాగా పెరిగింది. కొయ్యగుట్ట చౌరస్తా వరకు, తాడ్కోల్ చౌరస్తా నుంచి తాడ్కోల్ వరకు మరో పదుల సంఖ్యలో రేకులతో షాపులు వెలిశాయి. బస్‌డిపోలో సమీపంలో పదుల సంఖ్యలో రేకుల షాపులు వెలిశాయి. నెలకు ప్రాంతాన్ని బట్టి రూ. 5 వేల నుంచి రూ.40 వేల వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. వీటిలో వ్యాపార, వాణిజ్య లావాదేవీలు యథేచ్ఛగా కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వీటి నుంచి ఏ మాత్రం ఆస్తి పన్ను రావడం లేదు. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్, రెవిన్యూ విభాగం అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించిన దాఖలాలు లేవు. దీంతో బాన్సువాడ మున్సిపాలిటీకి భారీగా ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. వాస్తవానికి పట్టణ పరిధిలో ఇళ్లు, దుకాణాలు నిర్మించే ముందు స్థలం యజమాని అన్ని ధ్రువపత్రాలు సమర్పించి మున్సిపల్ అధికారుల నుంచి అనుమతి పొందాలి. ఆ తర్వాతే నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. పూర్తయ్యాక డోర్ నంబర్‌తో పాటు అసెస్‌మెంట్ చేసుకుని ఏటా ఆస్తి పన్ను చెల్లించాలి. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరి రాజు ఇది వరకే కొందరు యజమానులకు నోటీసులు అందజేసినా ఇంతవరకు స్పందించకపోవడం గమనర్హం. కొందరికి రాజకీయ నాయకులు వత్తాసు పలుకుతున్నట్లు సమాచారం.

### తనిఖీలు నిర్వహిస్తాం

ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది సమగ్ర సర్వేకు సంబంధించిన డాటా ఎంట్రీ పనిలో నిమగ్నమయ్యారు. ఇది పూర్తయిన వెంటనే 19 వార్డుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తాం. ఎక్కడెక్కడ రేకులతో షాపులు నిర్మించారో క్షుణ్ణంగా పరిశీలిస్తాం. అందరికి నోటీసులు జారీ చేసి పన్నులు విధిస్తాం.

– శ్రీహరి రాజు, ఇన్‌చార్జి కమిషనర్, బాన్సువాడ

## ‘లబ్ధిదారులకు సరుకులు ఇవ్వకుంటే కఠిన చర్యలు’



రామేశ్వర్‌పల్లి రేషన్ దుకాణంలో స్టాక్ పుస్తకాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య

**భిక్కనూరు:** ప్రభుత్వం నిరుపేదల కోసం రేషన్ దుకాణాల ద్వారా సరుకులను అందజేస్తుందని, రేషన్ డీలర్లు లబ్ధిదారులకు సరిగ్గా సరుకులు ఇవ్వకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య హెచ్చరించారు. రామేశ్వర్‌పల్లిలో రేషన్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రామేశ్వర్‌పల్లిలో డిసెంబర్ నెలకు సంబంధించి అంత్యోదయ కార్డు ఉన్న జగ్గన్నగారి అనితకు ఇవ్వాల్సిన కిలో చక్కరను డీలర్ సుకన్య ఇవ్వకపోవడంతో అనిత తండ్రి జగ్గారెడ్డి ఈ విషయాన్ని అడిగితే డీలర్ భర్త రమేష్ దుర్భాషలాడటంతో వారు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య గ్రామానికి వచ్చి విచారణ జరిపారు. లబ్ధిదారుల పట్ల దురుసుగా మాట్లాడటం పద్ధతి కాదని వారిని గౌరవించాలని సూచించారు. వెంటనే చక్కెరను వారికి ఇవ్వాలని సూచించారు.

### మహిళలపై వేధింపులను అరికట్టాలి



**లింగంపేట(ఎల్లారెడ్డి):** మహిళలపై వేధింపులను అరికట్టాలని ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సోలంకి రవళి అన్నారు. గురువారం లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆమె మాట్లాడారు. మానవ అక్రమ రవాణ, సామాజిక మాధ్యమాల వల్ల ఎదురయ్యే సమస్యలు, మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మహిళలు, బాలికలపై జరుగుతున్న హింస, వేధింపులు ఎలా అరికట్టాలి, ఎలా ఎదుర్కోవాలి తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది



**దోమకొండ/బీబీపేట:** భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దళిత బహుజన ఫ్రంట్ నేత తలారి ప్రభాకర్ అన్నారు. గురువారం దోమకొండ మండలం గొట్టుముక్కుల, సంగమేశ్వర్ గ్రామాల్లో, బీబీపేట మండలంలోని మాందాపూర్‌లో భారత రాజ్యాంగ ప్రచార ఉద్యమ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రాజ్యాంగ ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు భారత రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలను, ప్రచార ఉద్యమాన్ని జనవరి 26 వరకు నిర్వహిస్తామన్నారు. సంగమేశ్వర్ తాజా మాజీ సర్పంచ్ సుమలత, నాయకులు సత్యం, నరేష్, కాశయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

## సీఎం కప్ క్రీడలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేందర్

**లింగంపేట(ఎల్లారెడ్డి):** సీఎం కప్–2024 క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తహసీల్దార్ నరేందర్ సూచించారు. గురువారం ఆయన లింగంపేట రైతు వేదికలో జీపీ కార్యదర్శులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. గ్రామ స్థాయిలో 7, 8 తేదీల్లో క్రీడలు నిర్వహించుకొని ఎంపిక చేసిన క్రీడాకారుల పేర్లు మండల స్థాయిలో 10వ తేదీన బాలుర ఉన్నత పాఠశాలలో రిపోర్టు చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఖో,ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో 10, 11, 12 తేదీల్లో క్రీడల పోటీలు నిర్వహిస్తామన్నారు. ముందుగా గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. కార్యదర్శులు, పాఠశాలల ఉపాధ్యాయులు క్రీడాకారులకు అవగాహన కల్పించి క్రీడల్లో పాల్గొనేలా చూడాలన్నారు. ఎంపీడీవో నరేష్, మండల విద్యాధికారి షౌకత్‌అలీ, పీడీ రాజాగౌడ్ పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతో పంటలకు మేలు



దేశాయ్‌పేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ఫయాజుల్లా



నిజాంసాగర్: మాట్లాడుతున్న ఏవో నవ్య



దోమకొండలో మాట్లాడుతున్న ఏవో మణిదీపిక



ఎల్లారెడ్డిలో మట్టిని సేకరిస్తున్న అధికారులు

**సాక్షి నెట్‌వర్క్:** జిల్లాలో పలు చోట్ల గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మృత్తికా దినోత్సవం జరుపుకున్నారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ.. రైతులు నేల సారాన్ని కాపాడే పద్ధతులు పాటించాలన్నారు. ప్రతి సంవత్సరం భూసార పరీక్షలు చేయడం ద్వారా భూముల్లో పొటాషియం, భాస్వరం లభ్యత, 12 రకాల స్థూల, సూక్ష్మ పోషకాలను గుర్తించవచ్చని తెలిపారు. పోషకాల ఆధారంగా పంటలో ఎరువులను వాడాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల కొంతవరకు నేలసారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. నేల తల్లిని సజీవంగా ఉంచుదాం.. నేల జీవవైవిధ్యాన్ని కాపాడుదామని రైతులకు పిలుపు నిచ్చారు. మట్టి పరీక్ష నమూనాలు తీసే విధానం గురించి కూడా ఈ కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు.



రాజంపేటలో మాట్లాడుతున్న ఏడీఏ అపర్ణ



తాడ్వాయిలో..

## కొయ్యలను కాల్చితే భూసారానికి ముప్పు



నర్వలో కాల్చిన కొయ్యకాళ్లను పరిశీలిస్తున్న ఏడీఏ ఇంద్రసేన్



దేశాయ్‌పేటలో.. ఏఈవో దత్తేశ్వరి

**నిజాంసాగర్(జుక్కల్):** వరి కొయ్యలను కాల్చకుండా నీటితో మురగబెడితే భూములు సారవంతమై పంట దిగుబడులకు దోహదపడతాయని ఏడీఏ ఇంద్రసేన్ అన్నారు. గురువారం మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ శివారులో రైతులు కాల్చిన కొయ్య కాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట పొలాల్లో ఉన్న గడ్డిని కాల్చడం వల్ల కొయ్యల్లో ఉన్న సూక్ష్మజీవులు మరణిస్తాయన్నారు. దీని వల్ల పంటలకు కావాల్సిన పోషకాలు అందకుండా పోతాయని చెప్పారు. వ్యవసాయశాఖ అధికారులు నవ్య, అమర్‌ప్రసాద్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

**డీకంపోజర్ చల్లి కలియదున్నాలి**

**బాన్సువాడ రూరల్:** వరి పంట నూర్పిళ్ళ తర్వాత కొయ్యలను కాల్చరాదని ఏఈవో దత్తేశ్వరి అన్నారు. గురువారం ఆమె మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు. వరి మొదళ్లకు నీరు పెట్టి డీకంపోజర్ చల్లి కలియదున్నాలన్నారు. దీనివల్ల భూసారం పెరుగుతుందన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**పిట్లం(జుక్కల్):** మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గురువారం పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పంపిణీ చేశారు. 25 మందికి చెక్కులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ షేక్ నజీర్, నాయకులు మోహన్‌రెడ్డి, బొడ్డరాజు, మొయిన్ తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగ చిన్నారులకు క్రీడాపోటీలు



**ఎల్లారెడ్డి:** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్లారెడ్డి పట్టణంలోని రాజీవ్ విద్యా మిషన్ భవిత ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు గురువారం క్రీడాపోటీలు జరిపారు. దీంతోపాటు వారికి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. క్రీడాపోటీలలో గెలుపొందిన వారికి ఎల్లారెడ్డి ఎంపీడీవో ప్రకాశ్ బహుమతులను అందజేశారు.

### సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



**తాడ్వాయి(ఎల్లారెడ్డి):** విద్యా శాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు. తాడ్వాయి మండల కేంద్రంలో గురువారం భోజన విరామం అనంతరం నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ప్రిన్సిపల్ రాణి, సత్యనారాయణ, మౌనిక, మంజుల, నర్సిములు, బాలయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

### జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.లక్షా 26 వేల విరాళం



**కామారెడ్డి అర్బన్:** పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమైన పుస్తకాల కొనుగోలు కోసం జిల్లా గ్రంథాలయ సంస్థలకు పట్టణానికి చెందిన ఆకుల గోపికృష్ణ, కవిత దంపతులు లక్షా 26వేల రూపాయలు విరాళంగా అందజేశారు. గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో గోపికృష్ణ కవిత దంపతులు విరాళం అందజేయగా వారిని సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి శాలువాతో సన్మానించారు.

### వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



**రామారెడ్డి:** ఈ విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. కళాశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రిన్సిపల్ యాకునొద్దీన్ , అధ్యాపకులు నరసింహులు, సుజాత, రామకృష్ణ, తిరుపతి, శ్రీనివాస్, జయంత్, సాయిబాబా, సుదర్శన్, సత్యం, నజ్మా ఉన్నారు.

### మందకృష్ణ మాదిగతోనే సామాజిక న్యాయం



**దోమకొండ:** ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగతోనే సామాజిక న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకులు మంథని సామ్యెల్ మాదిగ అన్నారు. గురువారం దోమకొండలో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించగా ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. 30 సంవత్సరాలుగా గడ్డం వెంకటస్వామి కుటుంబం ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరిపోయి మాదిగలకు అవకాశాలు రాకుండా డబ్బు బలంతో రాజకీయాలను శాసిస్తున్నారని ఆరోపించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గడ్డం వినోద్, చెన్నూరు ఎమ్మెల్యేగా గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ ఒకే కుటుంబం నుంచి పదవులు పొందారని ఆరోపించారు. నాయకులు బట్ట వెంకటరాములు మాదిగ, మహిళా జిల్లా అధ్యక్షురాలు సట్టిగారి లక్ష్మి మాదిగ, బానపురం లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఆకతాయిలతో అప్రమత్తంగా ఉండాలి



**మాచారెడ్డి:** విద్యార్థినులు ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి షీటీం ఇన్‌చార్జి సౌజన్య అన్నారు. గురువారం మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీటీంలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ.. బస్టాండ్, కాలేజీలు, స్కూళ్లలో ఎవరైనా వెకిలి చేష్టలకు పాల్పడితే వెంటనే షీ టీం 8712671111, 8712686094 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. అలాగే సైబర్ నేరగాళ్ల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కళాజాత ఇన్‌చార్జి ప్రభాకర్ సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో 100, 108, 1930, 181 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలని కోరారు. షీటీం హెడ్ కానిస్టేబుల్ మదన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## సంక్షిప్తం

**విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ**

**పెద్దకొడప్‌గల్(జుక్కల్):** కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం కాటేపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే ఆయన మిత్రుడు సలీం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.5 వేలు విరాళంగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్‌రాజ్, కాంగ్రెస్ నాయకులు మొగుల గౌడ్, మొహిద్దీన్ పటేల్, అంజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు పాదరక్షల వితరణ**

**సదాశివనగర్(ఎల్లారెడ్డి):** కల్వరాల్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాదరక్షలను వితరణ చేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల శర్మ జ్ఞాపకార్థం రూ.10 వేల విలువ గల పాదరక్షలను విద్యార్థులకు అందజేశారు. ఎంఈవో యోసెఫ్, ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు, వీడీసీ చైర్మన్ కుంట రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా ప్రపంచ మృత్తికా దినోత్సవం**

**గాంధారి(ఎల్లారెడ్డి):** మండలంలో గురువారం ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గుర్జాల్ రైతు వేదిక భవనంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఏఈవో విఘ్నేష్ రైతులకు నేల గురించి పలు విషయాలు వివరించారు. మట్టి పరీక్షలకు అనుగునంగా పంటలు సాగుచేయాలని సూచించారు.

**రైతు భరోసా, రైతుల బీమా డబ్బులు విడుదల చేయాలి**



**గాంధారి(ఎల్లారెడ్డి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు రైతులకు రైతుభరోసా ఎకరానికి రూ.15,000, రైతు బీమా డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు గురువారం స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రవికి వినతి పత్రం ఇచ్చారు. నాయకులు శంకర్ రావు, రమేష్ రావు తదితరులున్నారు.

**కొనసాగుతున్న చెరుకు క్రషింగ్**

**సదాశివనగర్(ఎల్లారెడ్డి):** మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతుంది. మంగళవారం నాటికి 72వేల 975 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు తెలిపారు.

**బడి బయట పిల్లల గుర్తింపు**

**లింగంపేట(ఎల్లారెడ్డి):** ముస్తాపూర్ శివారులోని ఇటుక బట్టీల వద్ద బడి బయట పిల్లలను గుర్తించినట్లు సీఆర్పీ విజయ్‌కుమార్ తెలిపారు. 14 మంది బడి బయలట పిల్లలను గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. వీరికి త్వరలో ఇటుక బట్టీ వద్దనే స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రావు, ఇటుక బట్టీల యజమాని సంజీవులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.